

ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి

చేవెళ్లటౌన్, నవంబర్ 30: విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగలని చేవెళ్ల ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, న్యాయవాది కృష్ణాగౌడ్ తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని చైతన్య టెక్నో పాఠశాలలో వారం రోజుల నుంచి డ్రాయింగ్ కాంపిటేషన్, న్యూస్ పేపర్ మేకింగ్, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ, నృత్యాలు, వివిధ రాష్ట్రాల ఆహార ఆచార వ్యవహారాలపైన విద్యార్థులకు సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లె వెంకట్, ప్రధానోపాధ్యాయులు రాకేశ్‌కుమార్, అంజయ్య, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్‌లో
## బంగారు ఆభరణాలు అపహరణ

మొయినాబాద్, నవంబర్ 30 : ఆర్టీసీ బస్‌లో ప్రయాణించిన ఓ మహిళ హ్యాండ్ బాగు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీ అయిన ఘటన ఈ నెల 27న జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్‌లో నివాసం ఉంటున్న బండి రమ్యశ్రీ ఈ నెల 27న పని నిమిత్తం చేవెళ్లకు వెళ్లింది. పని ముగించుకుని తిరిగి సాయంత్రం చేవెళ్లలో మెహిదిపట్నం వెళ్లే ఆర్టీసీ బస్ ఎక్కి మొయినాబాద్ మండల కేంద్రంలో మసీదు వద్ద బస్ ఆపి దిగింది. ఇంటికి చేరుకున్న తరువాత బ్యాగులో ఉన్న ఆభరణాలు చూసుకుంటే కనిపించలేదు. అందులో రెండు తులాల బంగారు నల్లపూసల దండ, తులం రెండు ఉంగరాలు, చెవి కమ్మలు, ఒక తులం బంగారం ఉన్నది. బస్‌లో ఆభరణాలు కొట్టేశారని శనివారం బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### మాలల సింహగర్జన సభను
## జయప్రదం చేయండి

యాచారం, నవంబర్30: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 11గంటలకు నిర్వహించే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని నందివనపర్తి జైభీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అధ్యక్షుడు మరాటి వివేక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు భవిష్యత్‌లో తీవ్ర అన్యాయం జరుగనుందని ఆయన పేర్కొన్నారు. మాలల హక్కులను సాధించుకోవడానికే సింహగర్జన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మాలలు తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నేడు సీపీఎం మహా సభలు

ఆదిబట్ల, నవంబర్ 30: నేడు ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు గేట్ సమీపంలోని జంగారెడ్డి గార్డెన్‌లో నిర్వహించే సీపీఎం ఇబ్రహీంపట్నం మండల మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మున్సిపాలిటీ కార్యదర్శి నర్సింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు మండలంలోని పార్టీ సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. నాయకులు, పార్టీ సభ్యులు హాజరు కావాలని, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం సీపీఎం మండల కమిటీని ఎన్నుకుంటారని ఆయన పేర్కొన్నారు.

# విద్యాసంస్థల్లో పౌష్టికాహారం అందించాలి

**సర్కార్ బడుల్లో ఫుడ్‌పాయిజన్‌కు నిరసనగా పాఠశాలలు బంద్ చేపట్టిన ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు**



ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 30 : సర్కారు బడుల్లో వరుసగా ఫుడ్‌పాయిజన్ జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు బోడ వంశీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ జరుగుతున్న నేపథ్యంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో విద్యాశాఖమంత్రిని నియమించకపోవటం శోచనీయమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్‌పాయిజన్లు జరుగుతున్నా పట్టించుకోకపోవటం ఎంతో సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పౌష్టికాహారం అందించడంతో పాటు ఫుడ్‌పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రైవేటీకరణను ప్రోత్సహించడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించేంత వరకు ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు భాను, సైఫ్, సలీం పాల్గొన్నారు.

**ఫుడ్ పాయిజన్ కారకులను కఠినంగా శిక్షించాలి**

కడ్తాల్ : గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కారకులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు సిద్ధు డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలను నిరసిస్తూ, ఎస్‌ఎఫ్‌ఐ ఇచ్చిన పిలుపు మేరకు, శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా సిద్ధు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, అన్ని రకాల వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినోద్, ప్రశాంత్, రాఘవేందర్, చరణ్, అక్షయ్, వేణు, సందీప్ పాల్గొన్నారు.

**విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి**

పెద్దఅంబర్‌పేట : రాష్ట్రంలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనను నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు శనివారం ఇచ్చిన పాఠశాలల బంద్ విజయవంతమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు వినోద్ పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి వంశీ, ఉపాధ్యక్షుడు సాయి, ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు నవీన్, శ్రీశైలం పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలల బంద్**

షాద్‌నగర్‌టౌన్ : గురుకుల, సంక్షేమ వసతిగృహాలు, జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యత లేని భోజనంతో ఫుడ్‌పాయిజన్‌కు గురై విద్యార్థులు అస్వస్థత పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలు బంద్ చేసినట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్, విద్యార్థి సంఘాల నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.



కడ్తాల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు సిద్ధు



పెద్దఅంబర్‌పేట పాఠశాల నుంచి బయటకు వెళ్తున్న విద్యార్థులతో విద్యార్థి సంఘాల నాయకులు



షాద్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్



హైదర్‌అలీని సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

**రంగారెడ్డిజిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

రంగారెడ్డి, నవంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ప్రభుత్వ ఉద్యోగి ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జిల్లాలోని రెవెన్యూ శాఖలో 24సంవత్సరాల పాటు సేవలందించి శనివారం పదవీ విరమణ చేసిన హైదర్‌హలీని ఆయన సన్మానించారు. ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని అన్నారు. రెవెన్యూశాఖలో అనేక పదవుల్లో పనిచేసిన హైదర్‌హలీని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

### కొండా సురేఖకు విమర్శించే అర్హతలేదు

మంచాల, నవంబర్ 30: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై విమర్శలు చేసే అర్హత మంత్రి కొండాసురేఖకు లేదని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన మంచాలలో విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో గురుకుల పాఠశాలలో నాసిరకం ఆహారంతో విద్యార్థులు అవస్థలు పడుతుంటే వాటిని పట్టించుకోకుండా కొండా సురేఖ మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ల విషయంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం ఉందని చెప్పడం కొండా సురేఖ విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గురుకుల పాఠశాలలకు కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఎక్కడ కూడా చిన్న పొరపాటు దొర్లలేదని, నేడు నిత్యం ఏదో ఒక చోట గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అవుతున్నా కూడా అవి పట్టించుకోకుండా ఇతరులపై ఆరోపణలు చేయడం పనిగా పెట్టుకున్నారని అన్నారు. ఇకనైనా గురుకుల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు చెప్పారు.



భక్తులతో కిటకిటలాడుతున్న బుగ్గరామలింగేశ్వర స్వామి క్షేత్రం



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

## భక్తజన సంద్రంగా రామలింగేశ్వర ఆలయం

**స్వామివారిని దర్శించుకున్న భక్తులు**

మంచాల, నవంబర్ 30: మండల పరిధిలోని ఆరుట్లగ్రామంలోని బుగ్గరామలింగేశ్వ స్వామి జాతరకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కార్తిక స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు బుగ్గరామలింగేశ్వర స్వామిని దర్శించుకొని దేవాలయ ఆవరణలో మహిళలు దీపాలు వెలింగించి మొక్కులు చెల్లించారు.



దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

## 'ప్రజా సమస్యలపై పోరాడుతాం'



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వేస్లీ

మంచాల, నవంబర్ 30: గ్రామ స్థాయిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నాయకులు పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వేస్లీ అన్నారు. శనివారం మంచాల మండలం లోయపల్లి గ్రామంలో సీపీఎం 9వ మండల మహాసభలు నిర్వహించారు. ముందుగా లోయపల్లిలో సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జాన్‌వేస్లీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. గ్రామ స్థాయిలో వామపక్షాలు ఏకమై ప్రజా సమస్యలపై అధికారులను ఎప్పటికప్పుడు నిలదీయాలని చెప్పారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సామేల్, బుగ్గరాములు, జంగయ్య పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సర్వే

**కొత్తూరు మండలంలో 98 శాతం మున్సిపాలిటీలో 86 శాతం పూర్తి**



కొత్తూరు మున్సిపాలిటీలో సర్వే వివరాలను ఎంట్రీ చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

కొత్తూరు, నవంబర్ 30 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే శనివారంతో పూర్తయింది. కొత్తూరు మండలంలో 5815 ఇండ్లకు స్టిక్కరింగ్ చేశామని, ఇందులో 5700 కుటుంబాల సర్వే పూర్తయిందని ఎంపీడీవో అరుంధతి తెలిపారు. దీంతో పాటు 4500 కుటుంబాల సమాచారాన్ని కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశామని వివరించారు. అలాగే కొత్తూరు మున్సిపాలిటీలో 4389 కుంటుంబాలు స్టిక్కరింగ్ చేశామని మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. ఇందులో 3773 కుటుంబాలను సర్వేచేశామని తెలిపారు. 25 శాతం కుటుంబాల డాటా ఎంట్రీ పూర్తి చేశామని పేర్కొన్నారు. అలాగే సర్వే పూర్తి కాని కుటుంబాలకు వారు ఎవరైనా ఉన్నట్లు సమాచారం ఇస్తే ఎన్యూమరేటర్లు వారి ఎంటికి వెళ్లి వివరాలు తీసుకుంటారని చెప్పారు.



ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయంలో సర్వే ఫారాలను పరిశీలిస్తున్న చీఫ్ ప్లానింగ్ అధికారి సౌమ్య

**పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలి**

ఆమనగల్లు : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని చీఫ్ ప్లానింగ్ అధికారి సౌమ్య అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డేటా ఎంట్రీ నమోదును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ మండలంలో డేటా ఎంట్రీ ఇప్పటికే 80 శాతం పూర్తి చేసినందుకు ఆమె ఎంపీడీవో కుసుమ మాధురిని ప్రత్యేకంగా అభినందించారు. మిగితా 20శాతం రెండు రోజుల్లో పూర్తి చేస్తామని ఎంపీడీవో సీపీవోకు తెలియజేశారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు



మొయినాబాద్, నవంబర్30:ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలోని సర్వే నంబర్177లో అక్రమంగా ఓ వ్యక్తి కంటైనర్ ఏర్పాటు చేసుకున్నాడు. అదే విధంగా సర్వే నంబర్ 49లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మరో వ్యక్తి నిర్మాణం చేపడితే దానిని సైతం అధికారులు తొలగించారు. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ప్రీకాస్టును తొలగించారు. ప్రభుత్వ భూమిలో ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌతంకుమార్ హెచ్చరించారు.

## ఘన సన్మానం



జాఖీర్ అలీని సన్మానిస్తున్న శంషాబాద్ ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత

చేవెళ్లటౌన్, నవంబర్ 30: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని శంషాబాద్ ఏఈఎస్ శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత అన్నారు. 37సంవత్సరాలుగా ఎక్సైజ్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన ఎండి.జాఖీర్ అలీ కి అభినందన సభను శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎండి.ఖాజామోహినొద్దీన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్, రాష్ట్ర ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

## అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

**ఓ కూలీ, మరో బాలిక మృతి**

**మరో ఇద్దరికి గాయాలు**

కొత్తూరు, నవంబర్ 30: పొట్టకూటి కోసం కర్నూల్ నుంచి కొత్తూరు మండలానికి వలస వచ్చిన కూలీల్లో ఇద్దరు మృతి చెందారు. మృతుల్లో ఓ చిన్నారి కూడా ఉంది. కూలీలు తాము పనిచేసే గమ్యస్థానానికి చేరకముందే మృతి చెందడం మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ హుక్స్ కంపెనీ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే కొత్తూరు మండల పరిధిలోని రెడ్డిపాలెంలో పత్తి తీసేందుకు కర్నూలు జిల్లా నుంచి 8 మంది కూలీలు ట్రైన్‌లో శనివారం రాత్రి వచ్చి తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌లో దిగారు. వారిని రెడ్డిపాలెంకు చెందిన ఓ ట్రాక్టర్‌లో ఎక్కించుకొని తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో తిమ్మాపూర్ హుక్స్ కంపెనీ వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కూలీ సోమమ్మ, మరో చిన్నారి మమత అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరి కూలీలు ఉర్వకొండమ్మ, వెంకటేశ్వరమ్మకు గాయాలు అయ్యాయి. వారని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




### గత ప్రభుత్వం మంజూరు
## చేసిన నిధులతో శంకుస్థాపనలు

- **రూ.175 కోట్ల నిధులు రద్దు చేసిన కాంగ్రెస్ సర్కార్**

బడంగ్‌పేట, నవంబర్30: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నేడు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ గతం ప్రభుత్వంలో ఆర్‌సీఐ రోడ్డు నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు రూ. 32 కోట్లతో 150 ఫీట్ల రోడ్డును 2.60 కిలో మీటర్ల వరకు వేయడానికి నిధులు కేటాయించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టలేదన్నారు. ఏ శాఖల పైన అవగాహన లేకుండా పాలన కొనసాగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఏరంగంలో చూసిన అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు కన్పిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మహేశ్వరం నియోజక వర్గం ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ 13 బస్తీ దవాఖానలు, 9 అర్బన్ సెంటర్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అందులో ఆరు బస్తీ దవాఖానలను ప్రారంభించుకున్నామన్నారు. కొన్ని బస్తీ దవాఖానల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 3 అర్బన్ సెంటర్లు ప్రారంభం కాగా మిగతావి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అర్బన్ సెంటర్లకు గత ప్రభుత్వం రూ.1.43 కోట్లు కేటాయించిందన్నారు. మైనార్టీ ప్రాంతంలో ఉన్న ముస్లిం ప్రజలకు వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రజల సమస్యలను గాలికి వదిలేసి కక్ష పూరిత చర్యలకు దిగుతుందన్నారు. నియోజక వర్గానికి మంజూరైన రూ.175 కోట్ల నిధులు రద్దు చేయడం జరిగిందన్నారు. రద్దు చేసిన నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 100 పడకల దవాఖన మంజూరు చేశామని, ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉందన్నారు.

# పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలి



కందుకూరు రైతు వేదికలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేశ్

కందుకూరు. నవంబర్ 30 : రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలని రంగారెడ్డి జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సురేశ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పండ్ల తోటల రైతులకు పట్టుపరిశ్రమ, ఉద్యాన వనశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పూత దశలో మామిడి తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. కూరగాయల పంటలలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్‌లను ఏర్పాటు చేసుకున్నట్లయితే నాలుగేండ్ల అనంతరం ఎకరాకు ఐదు వేల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు. డ్రిప్, స్ప్రింకర్లను రాయితీపై ఇస్తుందని తెలిపారు. రైతులు లాభసాటి పంటలను వేసుకోవాలని సూచించారు. రైతులు ఆర్థికంగా ఎదుగడానికి పండ్ల తోటలతో పాటు కూరగాయల పంటలను వేసుకోవాలని కోరారు. సీఆర్‌ఐడీ సైంటిస్టు శ్రీకృష్ణ, మండల ఉద్యానవన అధికారి సౌమ్య, మండల వ్యవసాయ అధికారి కృష్ణమోహన్, ఏఈఓ రాజు, ప్రమోద్, మల్లేశ్, రైతులు లోకేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెంచర్ రోడ్డు కబ్జాపై ఫిర్యాదు..

**వ్యక్తిపై కేసు నమోదు**

నందిగామ, నవంబర్ 30: మండల కేంద్రంలోని 20 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన వేణుగోపాల్‌నగర్ వెంచర్‌లోని రోడ్డు కొంతమంది వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ప్లాటు యజమానులు ఫిర్యాదు చేశారు. దీంతో తమ ప్లాట్లలోకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ మేరకు ప్లాటు యజమాని శెట్టిపల్లి వైష్ణవి ఫిర్యాదు మేరకు రోడ్డు కబ్జాకు పాల్పడుతున్న మోహన్ సింగ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని నందిగామ సీఐ ప్రసాద్ తెలిపారు.

### బాధిత కుటుంబానికి
## ఆర్థికసాయం

కడ్తాల్, నవంబర్ 30: తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిరుమణి దశరథం మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శనివారం జంగారెడ్డిపల్లిలో బాధిత కుటుంబాన్ని నాయకులు పరామర్శి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ అందించిన రూ.3 వేలు, మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్ రూ.2 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో మోహన్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, జనార్ధన్‌గౌడ్, యాదయ్యగౌడ్, తిరుపతి, మల్లేశ్, వెంకటేశ్‌గౌడ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్తిరెడ్డి, కృష్ణయ్యగౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.